## క్లుప్తంగా

### రేపు హోమియోపై అవగాహన తరగతులు

తెనాలిటౌన్: పట్టణంలోని డాంగే వారి వీధిలో యోగా కేంద్రంలో ఆదివారం ఉచిత హోమియో అవగాహన తరగతులు శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య తెలిపారు. గంగానమ్మ పేటలోని యోగా సేవా కేంద్రంలో శుక్రవారం విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. 24 సంవత్సరాల నుంచి అనుభవం కలిగిన వైద్యులతో హోమియోపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు 83284 13606, 92971 02242 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

### రేపు కంటి వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: వాసవీ సేవా సమితి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి వైశ్య విద్యానిధి హాస్టల్ ఆవరణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు వైద్యసేవలు పొందాలని కోరారు.

### ఈ-క్రాప్ జాబితా విడుదల

కొల్లిపర: మండలంలోని గ్రామాల్లోని రైతులు ఈ-క్రాప్ బుకింగ్ జాబితా ఈ నెల 29లోపు సరిచూసుకోవాలని ఏఓ వెంకటరావు అన్నారు. శుక్రవారం మండంలోని అన్ని గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లో ఈ-క్రాప్ బుకింగ్ జాబితాను వ్యవసాయ సిబ్బంది విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాను రైతులు పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే వెంటనే వీఏఏలకు తెలియజేయాలని చెప్పారు.

### నేడు చంద్రబాబు నాయుడు కాలనీలో వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం మారీసు పేట చంద్రబాబు నాయుడు కాలనీలోని సచివాలయం వద్ద నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28వ సచివాలయం పరిధిలోని ప్రజలకు ఇక్కడ వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ క్యాంప్ కొనసాగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.

### వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం



తెనాలిఅర్బన్: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా స్థానిక చెంచుపేటలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. దోమకాటు వల్ల అనేక వ్యాధులు వస్తాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని చెప్పారు. ఫ్రై డేను డ్రైడేగా అందరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, దీపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### పోలీసుల రక్తదానం

తెనాలిరూరల్: పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా తెనాలి డీఎస్పీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు పోలీసులతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రక్తదానం చేశారు. అలానే సాయంత్రం డీఎస్పీ కార్యాలయం సమీపంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి తెప్పించిన వెపన్స్, డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్, భాష్ప వాయువు ప్రయోగ వాహనం పనితీరును విద్యార్థులకు వివరించారు. డీఎస్పీ బి. జనార్దనరావు పర్యవేక్షించారు.

### వైభవంగా ఉరుసు మహోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని మాబుసుభానీ ఉరుసు మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గార్మె పండుగను పురస్కరించుకొని మొదటిరోజు ఉరుసు మహోత్సవంలో భాగంగా గుర్రంపై గంథం ఉంచి గ్రామంలో ఊరేగించారు. పకీర్లు గానం చేస్తుండగా గ్రామంలో మేళతాళాలతో ఊరేగించి, దర్గా వద్ద గంథం, పూలు వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ముజావర్లు సయ్యద్ గౌస్, సయ్యద్ అబ్దుల్‌లు పర్యవేక్షించారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఉర్దూ స్కూల్‌లో జరిగిన వైద్య శిబిరం బీపీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తెనాలిఅర్బన్: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహ యాజమానుల వినతి మేరకు ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సేవలను అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకుడు అక్కిదాసు కిరణ్, కఠారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

**ఉర్దూ స్కూల్‌లో..**

సాలీ పేటలోని మున్షీ మస్తాన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు పలువురు స్పెషలిస్ట్ వైద్యులు వైద్య సేవలు అందించారు. వైద్యాధికారి డాక్టర్ డి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ క్యాంప్‌లో జనరల్ 94, రేడియాలజీ 52, ఆప్తమాలజీ 27 మందికి సేవలు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, 20వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లా గురునాథ గుప్తా, దామర్ల విజయరాణి, షేక్ జాకీర్, బైనా శ్రీను, డాక్టర్ దేవిక వాణి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ మౌనిక, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, హెల్త్ విజిటర్లు పుష్పలత, విజయకుమారి పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్ల వద్ద రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

# ప్రకృతి విధ్వంసంపై ధర్మాగ్రహం 'పంపాతీరం'

- కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత రచయిత్రి ఓల్గా
- నేడు తెనాలిలో నవలపై చర్చావేదిక

తెనాలి: భారతీయ పురాణ, చరిత్ర, ఇతిహాసాల్లోని పాత్రల్ని సమకాలీన దృక్పథాల ఆధారంగా అనుసృజన చేసే 'పోస్ట్ మోడర్నిజం' సాహితీ ప్రక్రియను అద్భుతంగా పండించటంలో ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గాది అందెవేసిన కలం. ఈ క్రమంలో రాసిన పుస్తకాల్లో మూడోది 'పంపాతీరం' నవల. ఇటీవల విడుదలైన ఈ పుస్తకంపై శనివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో చర్చావేదిక జరగనుంది. 'భిన్నస్వరాలు' సంస్థ ఆధ్వర్యంలో జరిగే చర్చలో రచయిత్రి ఓల్గాతోపాటు సాహిత్యరంగ ప్రముఖులు బండ్ల మాధవరావు, అరసవిల్లి కృష్ణ, డాక్టర్ పిల్లి వాసు పాల్గొంటారు.

పురాణాలు, చరిత్ర శకలాల నుంచి చిన్న ఆధారాలను తీసుకుని ఓల్గా రాసిన మూడు పుస్తకాలు ఫెమినిస్టు మెలకువను కలిగించేవే. పంపాతీరం నవల పంపానది ఒడ్డున గల అరణ్యానికి సంబంధించిన కథ. అరణ్యవాసులు, జీవులు సామ్రాజ్యాల విస్తరణలో నలిగి నాశనమైన దుర్మార్గమైన నాగరిక రాజ్య విస్తరణపై కలిగిన ఆగ్రహమే 'పంపాతీరం'. అరణ్యాలను దురాక్రమించే రాజ్యానికి బానిసగా చిక్కి, అతికష్టంపై రాజ్యపు ఉక్కు పిడికిలి నుంచి తప్పించుకున్న మాతం మునిని కలుసుకుని, అడవి బిడ్డగా జీవితాంతాన్ని చేరుకున్న శబరి ఇందులో ప్రధాన పాత్ర. సామాజిక విధ్వంసంతో మనుషులు మిగులుతారు కానీ, మానవీయమైనదేదీ మిగలదని శ్రీరాముడికి చెబుతుంది శబరి. రాజ్యంపై, నాగరికతపై శబరి పాత్రతో చేసిన విమర్శే ఈ నవల. కొత్త వస్తువులను, ఆయుధాలను సృష్టించటంలో పడి మంచితనాన్ని సృష్టించటం మనిషి మర్చిపోతున్నాడు. రాజ్యాధికార కాంక్ష అందరినీ బలితీసుకుంటుంది. అందులో ప్రకృతి విధ్వంసం కూడా ఒకటంటూ ఓల్గా ప్రస్తావించిన అంశం నేటి వర్తమాన పరిస్థితులకు అతికినట్టు సరిపోతుంది. అరణ్యవాసులను, ఆదివాసీలను అరణ్యాల నుంచి వెళ్లగొట్టటానికి రాజ్యం చేస్తున్న క్రూరమైన దాడులు, చట్టాలు, ఆక్రమణలేనని చెబుతారు. రాజ్యం తను పుట్టిన నాటి నుంచి అదే పని చేస్తోందనీ, ఆ రాజ్యాన్ని తిరస్కరించదలుచుకుని ఈ నవల రాశానని ఓల్గా ఖరాకండీగా చెప్పారు.



ఓల్గా

ఓల్గాకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును తెచ్చిపెట్టిన 'విముక్త' కథా సంపుటి కూడా ఈ కోవలోదే. రామాయణంలోని నాలుగు స్త్రీ పాత్రలను తీసుకుని, వారిద్వారా ప్రధానపాత్ర సీతకు సత్యదర్శనం చేయించిన సాహసిగా ఓల్గా గుర్తింపును పొందారు. శూర్పణఖ, అహల్య, రేణుక, ఊర్మిళాదేవిలతో సీత విడివిడిగా సమాగమమై, వారి దైన్యస్థితిని తెలుసుకోగోరి, సత్యదర్శనమై వారి నుంచి ధైర్యాన్ని తీసుకుంటుంది. వాల్మీకి రామాయణంలోలా రాముడిని నిరాకరించి తల్లి ఒడిలోకి చేరుకోదు. రాముడు కూడా ఆర్ష ధర్మానికీ, రఘు వంశానికీ, తండ్రికీ ఎంత బంధితుడో తెలియజెప్పి, తనతోపాటు విముక్త దిశగా ప్రయాణింపజేస్తుంది. అదే నిజమైన సీతారాముల ప్రేమ అనేది రచయిత్రి అంతరంగం. చరిత్రలో మరుగున పడివున్న స్త్రీల పాత్ర, చరిత్ర నిర్మాణంలో వారి భాగస్వామ్యంపైనా వెలుగు ప్రసరింపజేయాలన్నది ఓల్గా భావన. 'యశోబుద్ధ'నవల ఇందుకో నిదర్శనం. సిద్ధార్థుడి భార్యగానే అందరికీ తెలిసిన యశోధరను అద్వితీయంగా ఆవిష్కరించారు. సిద్ధార్థుడి తాత్విక ఆలోచనలను పంచుకుంటూ, ప్రపంచమంతటి నుంచీ హింస మాయమై ప్రేమ, కరుణ వెల్లివిరిసే రోజులను స్వప్నించిన యశోధర బుద్ధత్వం పొందారన్న భావనతోనే 'యశోబుద్ధ' అన్నారు.





పంపాతీరం నవల

### అధ్యాపకురాలిగా ఓల్గా ప్రస్థానం..

మహిళా స్వేచ్ఛ, సాధికారత కోసం కలం, గళమెత్తి ఓల్గాగా ప్రసిద్ధి పొందిన రచయిత్రి పోపూరి లలిత కుమారి. 1950లో ఉమ్మడి గుంటూరు జిల్లా యడ్లపాడులో జన్మించారు. ఏసీ కాలేజి, ఆంధ్ర యూనివర్శిటీలో చదివారు. తెనాలిలో 13 ఏళ్ల అధ్యాపకురాలిగా పనిచేశారు. స్వతహాగా మార్క్సిస్టు అయిన ఓల్గాపై తెనాలి రచయితలు చలం, కొడవటిగంటి కుటుంబరావు ప్రభావం ఉంది. మార్క్సిస్టు పార్టీ నుంచి బయటకొచ్చేసి తన అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ తొలి నవలగా 'స్వేచ్ఛ' రచించి, తెలుగునాట స్త్రీవాదానికి దారులు తెరిచారు. సహజ, మానవి, కన్నీటి కెరటాల వెన్నెల, గులాబీలు, ఆకాశంలో సగం నవలలు, రాజకీయ కథలు, ప్రయోగం, స్త్రీ వాద కవితలు రాశారు. అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్‌తో మహిళా సాధికారితకు కృషిచేశారు. కొన్ని సినిమాలకు స్క్రిప్టు రచనా విభాగంలో పనిచేశారు. ఉత్తమ రచయిత్రి, లోక్‌నాయక్, కేంద్ర సాహిత్య అకాడమీతో సహా పలు పురస్కారాలను అందుకున్నారు.

## భవనం పైనుంచి దూకి యువతి ఆత్మహత్య



తప్పెట శృతి (ఫైల్)

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో పని చేసే యువతి ఆరు అంతస్తుల భవనం మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... నగర పాలక సంస్థ పరిధిలోని గుడిమెడలో నివాసముండే తప్పెట అరుణ్‌కుమార్, దుర్గ దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో వారి కుమార్తె శృతి (19) యూనివర్సిటీలోని ఓ క్యాంటీన్‌లో హౌస్‌కీపర్‌గా పనిచేస్తోంది. గురువారం సాయంత్రం క్యాంటీన్ మూసివేసిన అనంతరం తన స్నేహితురాలైన పావనితో కలసి ఇంటికి వెళ్లింది. ఈ సమయంలో పావని యూనివర్సిటీలోని ఆర్ అండ్ డీ డిపార్ట్‌మెంట్‌లో ఆగింది. పావని పని ముగించుకుని శృతి కోసం బయట చూడగా ఆమె జాడ కనిపించలేదు. పావని ఇంటికి వెళ్లిపోయింది. శృతి గురించి ఆమె తల్లిదండ్రులు గురువారం రాత్రి పావనిని విచారించారు. నా కన్నా ముందే వచ్చేసిందని చెప్పింది. తెల్లవారుజామున శ్రీకాంత్ అనే వ్యక్తి ఆర్ అండ్ డీ బిల్డింగ్ వెనుక శృతి కిందపడి ఉండడం చూసి యూనివర్సిటీ యాజమాన్యానికి సమాచారం అందించాడు. వెంటనే ఆమెను కాలేజీ అంబులెన్స్‌లో తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు శృతి తల్లిదండ్రులతో కలసి యూనివర్సిటీకి వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. శృతి ఆత్మహత్య సమయంలో సెల్‌ఫోన్ పూర్తిగా ధ్వంసమైంది. ఆర్థిక బాధలు తట్టుకోలేక తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మాత్రం పగిలిపోయిన సెల్‌ఫోన్‌లో సమాచారాన్ని పూర్తిగా పరిశీలించి పోస్ట్ మార్టం నివేదిక వచ్చిన తరువాత శృతి మృతికి గల కారణాలు వెల్లడిస్తామని తెలిపారు.

## కేఎల్‌యూలో ఆయుధాల ప్రదర్శన

తాడేపల్లిరూరల్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మంగళగిరి 6వ బెటాలియన్‌కు చెందిన అధికారులు వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో విద్యార్థులకు ఆయుధాల గురించి అవగాహన కల్పించారు. మంగళగిరి ఆరో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.వి.హనుమంతు మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సిబ్బంది చేపట్టే చర్యల గురించి వివరించామని, విపత్తుల సమయంలో ప్రజలను ప్రమాదాల బారి నుంచి కాపాడడానికి ఉపయోగించే వివిధ పరికరాల గురించి అవగాహన కల్పించామన్నారు. శాంతిభద్రతలను కాపాడడానికి పోలీసులు ఉపయోగించే వివిధ ఆయుధాలు, రైఫిళ్లతోపాటు ఎకె 47 వంటి అత్యాధునిక మెషిన్ గన్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు.

వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వలన సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు నిర్వహించే విధుల గురించి విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, హ్యాపీ క్లబ్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.సుభాకర్‌రాజు, బెటాలియన్ ఆర్ఐలు పి.చంద్రరావు, జి.సుభాష్ చంద్రబోస్, ఆర్ఎస్ఐ ఎం.లోకేష్, ఏఆర్ఎస్ఐలు పి.రఘుబాబు, ఎస్.మూర్తి, వై.వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఆయుధాల గురించి వివరిస్తున్న ఆరో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.వి.హనుమంతు

### వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ముత్యాలరెడ్డినగర్‌లో నివాసం ఉండే డి.మణికంఠ(25) కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కుమార్తెకు హైదరాబాద్‌లో లివర్ సంబంధిత వ్యాధికి ఆపరేషన్ చేయించాడు. అందుకు అప్పులు చేశాడు. అప్పులు చెల్లించలేక గురువారం మణికంఠ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బేల్దారు కార్మికుడిపై వాచ్‌మెన్ దాడి

గుంటూరు ఈస్ట్: బేల్దారు కార్మికుడిపై వాచ్‌మెన్ దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అరండల్‌పేట 1వ లైనులో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద షేక్ సుభాని బేల్దారు పనులు చేస్తున్నాడు. నిర్మాణంలో ఉన్న వాచ్‌మెన్ వెంకట్ సుభానితో గొడవపడి దాడి చేశాడు. దాడిలో సుభానికి గాయాలు అయ్యాయి. శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అనాథ యాచకుడి శవానికి అంత్యక్రియలు

తెనాలి: అనాథలు, ఒంటరి వ్యక్తుల మరణించినపుడు వారి అంత్యక్రియలను నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి శుక్రవారం మరోసారి అనాథ యాచకుడికి చివరి సంస్కారాలను జరిపించింది. ఇక్కడి రైల్వే స్టేషను పరిసరాల్లో కొన్నేళ్లుగా భిక్షాటన చేస్తున్న 65 ఏళ్ల వృద్ధుడు చనిపోయాడు. రైల్వే స్టేషన్ టికెట్ కౌంటరు ప్రాంగణంలో ఉన్న మృత దేహాన్ని చూసిన రైల్వే సిబ్బంది, 3 టౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు విచారించి అనాథ శవం అయినందున, సేవ సమితికి అప్పగించారు. అనంతరం మృతదేహాన్ని బుర్రిపాలెం రోడ్డులోని మహా ప్రస్థానానికి తరలించి సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారం చేశారు. సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, రాంబాబు, పోతురాజు, సభ్యులు పాల్గొన్నారు. మహాప్రస్థానం కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్ వీరిని అభినందించారు.

## జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంటు ప్రారంభం

తెనాలి: పట్టణానికి చెందిన జీఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంటు శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక జయప్రకాష్ నగర్‌లోని ప్రైవేటు మైదానంలో మూడు రోజులు జరిగే టోర్నమెంటును స్థానిక 1, 39 వార్డుల కౌన్సిలర్లు గెడ్డేటి సురేంద్ర, ఝాన్సీవాణి ప్రారంభించారు. తొలిరోజు మోరంపూడి-ఈమని జట్ల మధ్య జరిగిన పోటీల్లో ఈమని జట్టు విజయం సాధించింది. మరో పోటీలో మధు టీమ్ గెలుపొందింది. ఈ కార్యక్రమంలో చావలి మురళీకృష్ణ, నాలాది ప్రభాకర్, దాసరి రమేష్, మట్లపూడి రాజేశ్వరరావు, అమర్తలూరి ప్రకాష్, అత్తోట అమృతరాజు పాల్గొన్నారు.



టోర్నమెంటును ప్రారంభిస్తున్న గెడ్డేటి సురేంద్ర, ఝాన్సీవాణి

## వ్యాపారిని మోసం చేసిన ఘటనపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తి షాపు యజమానిని మోసం చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నల్లచెరువుకు చెందిన అడ్డా శ్రీనివాసరావు నూనె గానుగ నిర్వహిస్తుంటాడు. ఈనెల 23న వినియోగదారుడు షాపుకు వచ్చి ఆయిల్ కొనుగోలు చేశాడు. తన వద్ద డబ్బులు లేవని, ఇంటి వద్ద ఉన్న వదిన ఫోన్ పే చేస్తోందని చెప్పాడు. అందుకు శ్రీనివాసరావుకు ఒక ఫోన్ నంబరు ఇచ్చి ఆ నంబరుకు రూ.1 చెల్లించాలని కోరాడు. శ్రీనివాసరావు వినియోగదారుడు చెప్పిన విధంగా ఆ సెల్ నంబరుకు ఫోన్‌పే ద్వారా రూ.1 చెల్లించాడు. వినియోగదారుడు టీ తాగి వస్తానని వెళ్లాడు. కొంత సేపటికి శ్రీనివాసరావు అకౌంట్‌లోని రూ.82వేలు విత్‌డ్రా అయ్యాయి. శ్రీనివాసరావు తాను మోసపోయినట్లు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# క్యాన్సర్ రోగుల ఆశాకిరణం

- డాక్టర్ పోలవరపు తులసీ పార్వతీదేవి
- సొంతూరులో ఉన్నత పాఠశాల నిర్మాణం
- క్యాన్సర్ ఆసుపత్రిని సాకారం చేసిన వితరణ శీలి



ఉన్నత పాఠశాల



డాక్టర్ తులసీ పార్వతీదేవి

తెనాలి: క్యాన్సర్ రోగుల ఆశా కిరణం డాక్టర్ పోలవరపు తులసీ పార్వతీదేవి కాంస్య విగ్రహాన్ని శనివారం ఆమె స్వస్థలమైన దుగ్గిరాల మండలంలోని కంఠంరాజు కొండూరులో ఆవిష్కరించనున్నారు. డాక్టర్ తులసీ పార్వతీదేవి గ్రామంలో నిర్మించిన కారుమంచి గోవిందయ్య ఉన్నత పాఠశాలలో నూతనంగా ఆమె పేరిట నిర్మించిన మెమోరియల్ బ్లాక్‌ను, విగ్రహాన్ని ఉదయం 10 గంటలకు ఆవిష్కరిస్తారు. చిత్తూరు జిల్లా ఏర్పేడులోని శ్రీ వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతులు పరిపూర్ణానందగిరి స్వాములు చేతుల మీదుగా ఆవిష్కరణ చేస్తారు. కారుమంచి రత్తమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పోలవరపు రాఘవరావు పర్యవేక్షిస్తారు. డాక్టర్ పోలవరపు తులసీ పార్వతీదేవి 1941లో జన్మించారు. రోడ్డు, బడి లేని ఆ పల్లెటూరిలో టీచరు దగ్గర చదువుకున్నా, 8వ తరగతికి మూడు కిలోమీటర్ల దూరంలోని దుగ్గిరాలకు వెళ్లాల్సివచ్చింది. పంట పొలాల గట్లపై నడిచి పాఠశాలకు వెళ్లారు. గుంటూరు విమెన్స్ కాలేజీలో ఇంటర్, తర్వాత మెరిట్‌పై గుంటూరులోని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేరారు. పూర్తయేసరికి కొత్తగా వచ్చిన ఎండీ కోర్సులో రెండు సీట్లలో ఒకటి తనకు లభించింది. 1966లో గైనకాలజీలో ఎండీగా బయటకొచ్చారు. కొంతకాలం ప్రభుత్వ వైద్యురాలిగా పనిచేశారు. 1972లో అమెరికాకు వెళ్లారు. 1978 నుంచి ప్రైవేట్ ప్రాక్టీస్ ఆరంభించారు. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ హాస్పిటల్ గైనకాలజిస్టుగా తులసీ పార్వతీదేవి, ఆర్థోపెడిక్‌గా భర్త రాఘవరావు వైద్య సేవలు అందించారు. చిన్నతనంలో చదువు కోసం తాను పడిన కష్టాలు మరెవరూ పడరాదని తల్లి కారుమంచి రత్తమ్మ పేరుతో ఎడ్యుకేషనల్ సొసైటీని, తండ్రి కారుమంచి గోవిందయ్య ఉన్నత పాఠశాలను 1992లో ప్రారంభించారు. «తానా» ద్వారా రూ.18 లక్షలు పంపి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన తొలి పాఠశాల ఇది. ఇందులో ఏటా వందలాది విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నారు. అనంతరం ఇంగ్లిష్ మీడియం వచ్చింది. అందరికీ ఫస్ట్ క్లాసులే. ఆడిటోరియం నిర్మించారు. ఇక్కడ చదివిన విద్యార్థుల్లో పలువురు విదేశాల్లో, ఇతర చోట్ల ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అమెరికన్ తెలుగు మహిళా సంఘం అధ్యక్షురాలిగా ఉంటున్న తులసీ పార్వతీదేవిని, మెడిసిన్‌లో తన శిష్యుడైన నరసరావుపేటకు చెందిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు 1997లో కలిశారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ప్రసూతి వైద్యశాలను క్యాన్సర్ ఆసుపత్రిగా మార్పు చేసేందుకు సహకారం అడిగారు. మహిళా సంఘం సమావేశం ఏర్పాటు చేసి, అందరి సహకారంతో 1998లో తులసీ పార్వతిదేవి చైర్‌పర్సన్‌గా «ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆర్గనైజేషన్» ఏర్పాటుచేశారు. తొలుత లక్ష డాలర్లు, తర్వాత మరో 50 వేల డాలర్లు, వైద్య పరికరాలను సమకూర్చారు. 2000 సంవత్సరం, జూన్‌లో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆరంభించారు. అమెరికా నుంచి ఏటా ఫండింగ్ చేస్తూ వచ్చారు. తర్వాత ఇన్‌స్టిట్యూట్‌కు అయిన అప్పును కూడా తీర్చి మరో మిలియన్ డాలర్లు సమకూర్చారు. అప్పట్లో క్యాన్సర్ రోగులు చికిత్సకని చెన్నై వెళ్లాల్సిన పనిలేకుండా ఉమ్మడి రాష్ట్రంలోనే చికిత్స అందించాలన్న భావనతో ఇందుకు పూనుకున్నట్టు ఆమె చెప్పేవారు. రాష్ట్ర విభజన జరిగాక కొత్త రాజధానిలో క్యాన్సర్ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని భావించినా కార్యరూపం దాల్చలేదు. మాతాశిశు మరణాలను తగ్గించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలతో కూడిన మహిళల కోసమే ప్రత్యేకంగా వైద్యశాల, దంత, ఫార్మసీ వైద్య కళాశాలలను కొందరి సహకారంతో సొసైటీగా ఏర్పడి స్థాపించాలని ఆశించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కలిసి పేదలకు వైద్య సాయం అందించాలని, వైద్య బృందాలు వారం వారం గ్రామాల్లోకి వెళ్లి పరీక్షలు చేయటం, అవసరమైన రోగులకు ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స చేసేలా విధానం రూపొందించాలని అనుకున్నారు. వీటిన్నిటిపైనా అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించారు. అవి కార్యరూపం దాల్చలేదు. తులసీ పార్వతి కుమార్తె శైలజ, కొడుకు హరికిషన్ ఇద్దరూ వైద్యులే. ఆ ఇంట్లో నలుగురు వైద్యవృత్తిలో ఉండటం విశేషం. 2019 అక్టోబరు 12న అమెరికాలోనే ఆమె గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె కోరిక ప్రకారం సొంతూరులోనే అంత్యక్రియలను చేశారు. ఇప్పుడామె పేరుతో మెమోరియల్ బ్లాక్‌ను నిర్మించి, విగ్రహాన్నీ ఆవిష్కరిస్తున్నారు.

### విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

తాతిరెడ్డిపాలెం(తాడికొండ): విద్యుత్ మోటార్‌తో నీరు పెడుతుండగా షాక్ తగలడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన తాడికొండ మండలం తాతిరెడ్డిపాలెం జగనన్న కాలనీలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు గుంటూరు బ్రాడీపేటకు చెందిన జక్కిరెడ్డి వీరారెడ్డి (48) లాం గ్రామ పంచాయతీ పరిధిలోని తాతిరెడ్డిపాలెంలో జగనన్న కాలనీ అర్బన్ లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటికి నీరు కొడుతుండగా పైపు నుంచి కారుతున్న నీరు లీకేజీని సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. తాడికొండ ఎస్ఐ నాగార్జున ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### హత్య కేసులో నిందితుల అరెస్టు

మేడికొండూరు: యలవర్తిపాడు గ్రామంలో ఇటీవల ఇరువర్గాల ఘర్షణలో ఒక వ్యక్తి మృతి చెందగా హత్య కేసు నమోదు చేశారు. హత్య కేసులో నిందితులు పరారీలో ఉన్నారు. సీఐ వాసు తన సిబ్బందితో నిందితులు మన్నవ మహేష్‌కుమార్, మరియకుమారిలను ప్రత్తిపాడు పరిసరాల్లో అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వాసు తెలిపారు.

### గోల్డ్ స్కీం పేరిట మోసం

తెనాలిరూరల్: స్కీములో చేరి నెల నెలా డబ్బు చెల్లిస్తే బంగారం ఇస్తామని చెప్పి మోసం చేయడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నందుల పేటకు చెందిన గోల్డ్ వర్కర్ జొన్నాదుల చిరంజీవి తనకు తెలిసిన వారి ద్వారా పట్టణానికే చెందిన ఇద్దరి వద్ద గోల్డ్ స్కీములో చేరారు. పలు దఫాలుగా రూ. 15.66 లక్షలు వారికి చెల్లించాడు. రోజులు గడుస్తున్నా బంగారం ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించిన చిరంజీవి పోలీసులను ఆశ్రయించాడు. వన్ టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.